

# IMMANUEL BIBLE COLLEGE

CHRISTIANPET NIDUBROLU






అబద్ధమాడుటను గూర్చియు, క్రైస్తవులై ననూ, అన్యులైననూ, ఎవరైననూ నిరంతరముగా అబద్ధమాడుచున్నట్లైతే, వారికెటు వంటి పరిణామములు ఎదురవుతాయో, వాటిని గూర్చి వివరించి చెప్పుటయే ఈ ప్రసంగ పాఠము యొక్క ముఖ్యోద్దేశ్యము. మనమెవ్వరము నాశనమగుట దేవుని కోరిక కాదు కనుక ఆయన వాక్యము ద్వారా మనలో దిద్దుబాటును, సర్దుబాటును కలిగించవలెనని ఆయన కోరిక. **అబద్ధమాడుట** అనగా **సత్యమును పలుకకపోవుట, సత్యమును జరిగించకపోవుట** ఒక ఫలితమును లేదా ఫలమును సాధించుటకొరకు **మోసమును** ఉపయోగించు కొనుటయే **అబద్ధము.** అబద్ధము అనగా **ఉద్ధేశ్య పూర్వకముగా తప్పుడు కథనమును** చెప్పుట, **సత్యమును దాచిపెట్టుట, మోసగించుట, వంచించుట, తప్పుదోవ పట్టించుట నిజమైన, పరిపూర్ణ కార్యమును కాక, వేరొక భావమిచ్చు దానిని చెప్పుట.** ఎటువంటి **అబద్ధమునైనను చెప్పుటగాని, అటువంటి అర్ధమునిచ్చుదానిని ఉపయోగించుట గాని,** పాపము. **పాపము నిన్ను దేవుని** నుండి **వేరుచేయును.** సరే, ఇది చిన్న అబద్ధము, లేదా శుద్ధ అబద్ధము అని మనము చెప్పలేము. మన పాపము చిన్నదా, పెద్దదా అను దాని మీద దేవుడు మనలను తీర్పు తీర్చడు. **పాపము పాపమే. రోమా 6:23** "ఏలయనగా **పాపము వలన వచ్చు జీతము మరణము.** అయితే దేవుని కృపావరము మన ప్రభువైన క్రీస్తుయేసునందు నిత్యజీవము" మరణము దేవునినుండి మనలను వేరుపరచు **పరలోక సంబంధ ఏర్పాటు.** (అగ్నిగుండములో)!

**మత్తయి 12:34** లో యేసుక్రీస్తు ఈ విధముగా చెప్పుచున్నాడు. "సర్పసంతానమా, మీరు చెడ్డవారైయుండి ఏలాగు మంచిమాటలు పలుక గలరు? **హృదయమందు నిండియుండుదానిని బట్టి నోరు మాటలాడును గదా!" యిర్మియా 17:19.** అన్నిటికంటె **మోసకరమైనది,** అది **ఘోరమైన వ్యాధికలది,** దాని గ్రహింపగలవాడెవడు? **ఒకని ప్రవర్తనను బట్టి వాని క్రియలఫలము చొప్పున ప్రతికారము** చేయుటకు **యెహోవా అను నేను హృదయమును పరిశోధించువాడను, అంతరింద్రియములను పరీక్షించువాడను.**

**అంప్లిఫైడ్ బైబిలు ప్రకారము:** "హృద యము అన్నిటికంటె మోసకరమైనది, అది వక్రబుద్ధి గలది, కఠినమైనది, ఘోరమైన మరణకరమైన వ్యాధి కలది. దాని గ్రహింపగలవాడెవడు? (దాని కనుగొను వాడెవడు, అర్ధముచేసుకొనువాడెవడు, తన హృదయమునకు, మనస్సుకు సన్నిహితముగా వుండు వాడెవడు.) ఒకని ప్రవర్తనను బట్టి, వాని క్రియల ఫలము చొప్పున ప్రతికారము చేయుటకు యెహోవా అను నేను హృదయమును పరీక్షించువాడను అంతరింద్రియములను పరిశోధించువాడను." మనము అబద్ధమాడుచున్నప్పుడు, మన హృదయ ములో ఉండుదానిని బట్టియే మాటలాడుచున్నాము. కాబట్టి మోసమును, వక్రబుద్ధిని సంభాళించుటకు లోలోపలనుండి వాటిని వెళ్లగొట్టుటకు దేవుడు మన హృదయములో తన వాక్యమును ఉంచియున్నాడు.

**సామెతలు 12:19 "నిజమాడు పెదవులు నిత్యము స్థిరమైయుండును అబద్ధమాడు నాలుక క్షణమాత్రమే యుండును"**

**సామెతలు 12:20 "కీడు కల్పించు వారి హృదయములో మోసముకలదు సమాధానపరచుటకై ఆలోచన చెప్పువారు సంతోషభరితులగుదురు."**

**సామెతలు 12:22 "అబద్ధమాడు పెదవులు యెహోవాకు హేయములు సత్యవర్తనులు ఆయనకిష్టులు."** మన మార్గములందలి తప్పిదములను మనము గుర్తించి, పశ్చాత్తాపము నొందాలి. పశ్చాత్తాపము నొందుట అనగా కేవలము క్షమాపణ చెప్పి, మరలా తరువాతిరోజు తిరిగి దానినే జరిగించడం లేదా పలకడం కాదు. నిజమైన పశ్చా త్తాపం దేవుని సహాయము ద్వారా కలిగినదై యుంటుంది. దానిని ఎన్నటికి తిరిగి **జరిగించకూడదు, పలుకకూడదు. పాపమునుండి మరలుటయే పశ్చాత్తాపము.**

పది ఆజ్ఞలలోని ఒక ఆజ్ఞ **నిర్గమ. 20:16** "నీ పొరుగువాని మీద అబద్ధసాక్ష్యము (అనగా అబద్ధము) పలుకకూడదు." **నిర్గమ. 23:1** "లేని వార్తను పుట్టింంపకూడదు. అన్యాయపు సాక్ష్యమును పలుకుటకై దుష్టునితో నీవు కలియకూడదు.

**అంప్లిఫైడ్ బైబిలు ప్రకారము** "లేనివార్తను తిరిగి చెప్పకూడదు (లేదా) పుట్టింపకూడదు. అన్యాయపు సాక్ష్యమును పలుకుటకై దుష్టునితో నీవు కలియ కూడదు." **సామెతలు 19:9 "కూటసాక్షి** శిక్షనొందక పోడు. **అబద్ధములాడువాడు నశించును." సామెతలు 24:28.** "నిర్నిమిత్తముగా నీ పొరుగువానిమీద సాక్ష్యము పలుకకుము. నీ పెదవులతో మోసపు మాటలు చెప్పవచ్చునా?"

**అపొ.కా. 5:1-11** "అననీయ అను ఒక మనుష్యుడు తన భార్యయైన సప్పీరాతో ఏకమై పొలమమ్మెను. భార్య యెరుకనేవాడు దాని వెలలో కొంత దాచుకొని కొంత తెచ్చి అపోస్తలుల పాదముల యొద్ద పెట్టెను. అప్పుడు పేతురు – అననీయా, నీ భూమి వెలలో కొంత దాచుకొని పరిశుద్ధాత్మను మోసపుచ్చుటకు సాతాను ఎందుకు నీ హృదయమును ప్రేరేపించును? అది నీ యొద్ద నున్నప్పుడు నీదే గదా? అమ్మిన పిమ్మట అది నీ వశమై యుండలేదా? యెందుకు ఈ సంగతి నీ హృదయములో ఉద్దేశించుకొన్నావు? **నీవు మనుష్యులతో కాదు దేవునితోనే అబద్ధమాడితివని వానితో** చెప్పెను. అననీయ యీ మాటలు వినుచునే పడి ప్రాణము విడువగా విననవారికందరికిని మిగుల భయము కలిగెను; అప్పుడు పడుచువారు లేచి వానిని బట్టతో

చుట్టి మోసికొని పోయి పాతిపెట్టిరి. ఇంచు మించు మూడు గంటల సేపటికి వాని భార్య జరిగినది యెరుగక లోపలికి వచ్చెను. అప్పుడు పేతురు – మీరు ఆ భూమిని ఇంతకే అమ్మితిరా నాతో చెప్పుమని ఆమెను అడిగెను. అందుకామె – అవును ఇంతకే అని చెప్పెను. అందుకు పేతురు – ప్రభువు యొక్క అత్మను శోధించుటకు మీరెందుకు ఏకీభవించితిరి? ఇదిగో నీ పెనిమిటిని పాతిపెట్టిన వారి పాదములు వాకిటనే యున్నది; వారు నిన్నును మోసికొని పోవుదురని ఆమెతో చెప్పెను. వెంటనే ఆమె అతని పాదములయొద్దపడి ప్రాణము విడిచెను. ఆ పడుచువారు, లోపలికి వచ్చి, ఆమె చనిపోయినది చూచి, ఆమెను మోసికొనిపోయి, ఆమె పెనిమిటి యొద్ద పాతిపెట్టిరి. <u>**సంఘమంతటికిని,**</u> ఈ సంగ తులు వినినవారికందరికిని, <u>**మిగుల భయము కలిగెను."**</u>

అననీయా సప్పీరాలు డబ్బు విషయమై పాపమును జరిగించినందువలన, వెంటనే దేవుని చేత వారి మోసము విషయమై తీర్పు తీర్చబడిరి. ఇది <u>**నూతన నిబంధన సంఘములో నూతన ఒడంబడిక**</u> ప్రకారము జరిగెను." <u>**దేవుడు పక్షపాతి కాదు. ఇంకనూ నీవు అబద్ధమాడుచున్నట్లైతే,**</u> అననీయా సప్పీరాలకు దేవుడు ఏమి జరిగించి యున్నాడో, అదే నీ యెడలను జరిగించుతాడు.

<u>**యెషయా 55:10-11**</u> "వర్షమును హిమమును అకాశమునుండి వచ్చి అక్కడికి ఏలాగు మరలక భూమిని తడిపి విత్తువానికి విత్తనమును భుజించువానికి అహారమును కలుగుటకై అది చిగిర్చి వర్ధిల్లునట్లు చేయునో, <u>**అలాగే నా నోటనుండి వచ్చు వచనమును ఉండును. నిష్ఫలముగా నా యొద్దకు మరలక అది నాకు అనుకూలమైనదాని నెరవేర్చును నేను పంపిన కార్యమును సఫలము చేయును." దేవుడు తన వాక్కును నెరవేర్చబోవుచున్నాడు.**</u>

<u>**అపో.కా. 17:30**</u> "ఆ అజ్ఞానకాలములను దేవుడు చూచి చూడనట్టుగా ఉండెను; ఇప్పుడైతే అంతటను అందరును మారుమనస్సు పొందవలెనని మనుష్యులకు ఆజ్ఞాపించుచున్నాను. ఎందుకనగా తాను నియమించిన మనుష్యునిచేత నీతి ననుసరించి భూలోకమునకు తీర్పుతీర్చబోయెడి యొక దినమును నిర్ణయించియున్నాడు మృతులలోనుండి ఆయనను లేపినందున దీని నమ్ముటకు అందరికిని ఆధారము కలుగజేసియున్నాడు."

<u>**అంప్లిఫైడ్ బైబిలు ప్రకారము :**</u> "ఆ (ముందటి అజ్ఞానకాలములను దేవుడు చూచిచూడ నట్టు ఉండెను. ఇది సత్యము. ఇప్పుడైతే, అంతట అందరును మారుమనస్సు పొందవలెనని మనుష్యులకు ఆజ్ఞాపించుచున్నాడు. అనగా వారిగత పాపములను విడిచి, ఇంకా మేలైనవిగా, హృదయ పూర్వకముగా, తమ మార్గములను దిద్దుకొనునట్లు వారి మనస్సులను మార్చుకొనుమని దేవుడు ఆజ్ఞపించుచున్నాడు. ఎందుకనగా తాను నియమించి న మనుష్యునిచేత నీతిననుసరించి, భూలోకమునకు తీర్పుతీర్చబోయెడి యొక దినమును నిర్ణయించి యున్నాడు. మృతులలోనుండి ఆయనను లేపినందున దీనిని నమ్ముటకు అందరికిని నిశ్చయమును, నమ్మికను, రుజువును ఆధారమును కలుగజేసి యున్నాడు. దేవుడు మొదటగా మనలను (అనగా సంఘమును) తీర్పు తీర్చకుండా వారి పాపముల విషయమై లోకమునకు తీర్పుతీర్చడు.

<u>**1పేతురు 4:17**</u> లో <u>**పేతురు ఈ విధముగా చెప్పుచున్నాడు.**</u> "తీర్పు దేవుని ఇంటియొద్ద ఆరంభమైతే దేవుని సువార్తకు అవిధేయులైన వారి గతి యేమవును?

<u>**అంప్లిఫైడ్ బైబిలు ప్రకారము:**</u> "తీర్పు దేవుని ఇంటియొద్ద ఆరంభమగు కాలము (వచ్చియున్నది) న, అది మనయొద్దనే ఆరంభమైతే, దేవుని సువార్తను నమ్మనివారియు, అవిధేయులైనవారియు, దేవుని సువార్తయందు మర్యాద లేనివారి గతి యేమవును?

<u>**ప్రకటన 22:14-15**</u> "జీవవృక్షమునకు హక్కుగలవారై, గుమ్మముల గుండ ఆ పట్టణము లోనికి ప్రవేశించునట్లు తమ వస్త్రములను ఉదుకు కొనువారు ధన్యులు. కుక్కలును, మాంత్రికులును, వ్యభిచారులును నరహంతకులును, విగ్రహారాధకు లును <u>**అబద్ధమును ప్రేమించి జరిగించు ప్రతివాడును**</u> వెలుపటనుందురు.

<u>**అంప్లిఫైడ్ బైబిలు ప్రకారము:**</u> జీవ వృక్షమును (సమీపించుటకు) అధికారమును హక్కుగలవారై, గుమ్మములగుండ ఆ పట్టణములోనికి ప్రవేశించునట్లు తమ వస్త్రములను ఉదుకుకొనువారు ధన్యులు. కుక్కలును (వ్యభిచారులు, కామాతురతగలవారు) నరహంతకులును, విగ్రహారాధకులును, <u>**అబద్ధమును అనగా అసత్యము, తప్పును, మోసమును, వంచనను ప్రేమించి జరిగించు ప్రతివాడును వెలుపటనుందురు.**</u>

<u>**ప్రకటన 21:8**</u> "పిరికివారును, అవిశ్వాసు లును, అసహ్యులును, నరహంతకులును, విగ్రహారాధ కులును, అబద్ధికులందరును అగ్ని గంధకములతో మండు గుండములో పాలుపొందుదురు; ఇది రెండవ మరణము.

<u>**అంప్లిఫైడ్ బైబిలు ప్రకారము:**</u> "పిరికివారును, నీచులు, హేయులు (తిరస్కరింపబడినవారు) ధైర్యము కొదువైన వారు, పిరికితనముతో లొంగెడివారు, అవిశ్వాసులు, నమ్మికలేనివారు, నీతిచెడిన దుర్మార్గులు, దుష్టత్వముతో నిండినవారు, నరహంతకులు, కామాతురతగలవారు, వ్యభిచారులు, మంత్రతంత్ర విద్యలు పాటించువారు, విగ్రహారాధికులందరూ, (దేవునిని తప్ప, దేనికైననూ, దేనినైననూ, అగ్నిపూజలు నిర్వహించువారు) <u>**అబద్ధికులందరూ**</u> (మాటలోగాని, చేతలోగాని, తెలిసి అసత్యము జరిగించెడివారు) వీరందరూ <u>**అగ్నిగంధకములతో మండు గుండములో పాలు పొందుదురు;**</u> ఇది రెండవ మరణము." అబద్ధికులందరూ (క్రైస్తవులు-క్రైస్తవులు కానివారు) శుద్ధమయిన పశ్చాత్తాపము లేనట్లైతే వారందరూ అగ్ని గంధకములతో మండు గుండములో పాలుపొందవలసి ఉండును.

అటువలెనే, ప్రభోజనము విషయములో చూచినట్లైతే, క్రైస్తవులుగా మనం, పాపముచేసినట్లైతే, మనం ప్రభోజనములో పాలుపంచుకొనకూడదు. <u>**1కొరింథీ. 11:27:31**</u> "కాబట్టి యెవడు <u>**అయోగ్యముగా**</u> ప్రభువుయొక్క రొట్టెను తినునో, లేక ఆయన పాత్రలోనిది త్రాగునో, వాడు ప్రభువుయొక్క శరీరమును గూర్చియు, రక్తమును గూర్చియు అపరాధియగును. కాబట్టి <u>**ప్రతిమనుష్యుడు తన్నుతాను పరీక్షించుకొనవలెను**</u> అలాగు చేసి ఆ రొట్టెను తిని, ఆ పాత్రలోనిది త్రాగవలెను. ప్రభువు శరీరమని వివేచింపక తిని త్రాగువాడు <u>**తనకు శిక్షావిధి కలుగుటకే**</u> తిని త్రాగుచున్నాడు. ఇందువలననే మీలో అనేకులు బలహీనులును రోగులునైయున్నారు. చాలామంది నిద్రించుచున్నారు. అయితే మనలను మనమే విమర్శించుకొనినయెడల తీర్పు పొందక పోదుము.

**అంప్లిఫైడ్ బైబిలు ప్రకారము:** కాబట్టి యెవడు అయోగ్యముగా (తన విషయములో) ప్రభువుయొక్క రొట్టెను తినునో, లేక ఆయన పాత్రలోనిది త్రాగునో, వాడు ప్రభువుయొక్క శరీరమును గూర్చియు, రక్తమును గూర్చియు అపరాధియగును. కాబట్టి ప్రతి మనుష్యుడు తన్నుతాను (జాగ్రత్తగా) పరీక్షించుకొనవలెను." అలాగు చేసి (తరువాత మాత్రమే) ఆ రొట్టెను తిని ఆ పాత్రలోనిది త్రాగవలెను. ప్రభువు శరీరమని వివేచింపక, గుర్తించక, ఆయన గుణము గ్రహించక తిని త్రాగువాడు తనకు శిక్షావిధి కలుగటకే తిని త్రాగుచున్నాడు. ఇందువలననే (ఆ నిర్లక్ష్యమువలననే) మీలో అనేకులు బలహీనులును రోగులునైయున్నారు; చాలా మంది మరణమునందు నిద్రించుచున్నారు. అయితే మనలను మనమే పరిశోధించి, పరీక్షించి కొని, మన తప్పిదములను కనిపెట్టి మన స్వస్థతను గుర్తించినయెడల తీర్పుపొందక పోదుము. శిక్షాదండన పొందకపోదుము (దేవుని తీర్పు నుండి).

ఎవరితోనైనా, ఏ విషయములోనైనా నీవు అబద్ధమాడియుండి, ఇంకను నీవు పశ్చాత్తాపము నొందక, దేవుని యెదుటను, ఆ మనుష్యుని యెదుటను దానిని నీవు సరిచేసుకొననట్లైతే, అప్పుడు నీవు ప్రభురాత్రి భోజనమును తీసుకొనుటకు **అనర్హుడవు.**

**మత్తయి 5:23-24** "కాబట్టి నీవు బలిపీఠము నొద్ద అర్పణము నర్పించుచుండగా నీ మీద నీ సహోదరునికి విరోధమేమైనను కలదని అక్కడ నీకు జ్ఞాపకమువచ్చినయెడల అక్కడ బలిపీఠము నెదుటనే నీ యర్పణము విడిచిపెట్టి, మొదట వెళ్లి నీ సహోదరు నితో సమాధానపడుము; అటుతరువాత వచ్చి నీ యర్పణము నర్పింపుము."

**అంప్లిఫైడ్ బైబిలు ప్రకారము:** 'కావున నీవు బలిపీఠమునొద్ద అర్పణము నర్పించుచుండగా నీ మీద నీ సహోదరునికి కష్టమేమైననూ కలదని అక్కడ నీకు జ్ఞాపకము వచ్చినయెడల, అక్కడ బలిపీఠము నొద్దనే నీ యర్పణము విడిచిపెట్టి **మొదట వెళ్ళి నీ సహోదరునితో శాంతిని (సమాధానమును) ఏర్పరచుకో,** అటు తరువాత వచ్చి నీ అర్పణము నర్పింపుము." కాబట్టి మనము ఎవరితోనైనా, ఏ విషయములోనైనా, అబద్ధమాడినట్లైతే, ప్రభురాత్రి భోజనమును తీసుకొనబోయేముందు, మొదటగా ఆ తప్పిదమును మనము సరిచేసుకోవాలి. లేనట్లైతే, **మనలను మనమే నిందించుకొనవలసివచ్చును.**

**ఒకానొక మనుష్యుని గూర్చి, లేదా అతనితోనే నీవు అబద్ధమాడినట్లైతే, అతనిని నీవు ప్రేమించుచున్నావని** చెప్పజాలవు. దానిని ప్రేమతో నడుచుట అని చెప్పలేము.

**రోమా 13:10** ప్రకారము "ప్రేమ పొరుగువానికి కీడుచేయదు గనుక **ప్రేమకలిగి యుండుట ధర్మశాస్త్రమును నెరవేర్చుటయే.**

**యోహాను 13:34-35** "మీరు **ఒకరినొకరు ప్రేమింపవలెనని** మీకు **క్రొత్త ఆజ్ఞ** ఇచ్చు చున్నాను; నేను మిమ్మును ప్రేమించినట్టే మీకును ఒకరినొకరు ప్రేమింపవలెను. **మీరు ఒకనియెడల ఒకడు ప్రేమగలవారైనయెడల** దీనబట్టి మీరు నా శిష్యులని అందరును తెలిసికొందురనెను." **నీవు నిజముగా ప్రభువైన యేసుక్రీస్తు యొక్క శిష్యుడవే అయితే, నిశ్చయముగా నీవు ప్రేమలో నడుతువు, నీవు ఎప్పటికి నీ పొరుగువానితోను, వానిని గూర్చియు అబద్ధమాడవు.**

**ఒక్క విషయం గమనించు, దేవుడు అబద్ధికునిని ఆశీర్వదించడు.** ఎందుకనగా అబద్ధమాడుట పాపము, ఎటువంటి పాపమైననూ, నీ జీవితములో ప్రభువనుగ్రహించు పరిపూర్ణమైన ఆశీర్వాదములనుండి నిన్ను వేరుచేయును. **ఎఫెసీ. 4:25** "మనము ఒకరినొకరము అవయవములై యున్నాము గనుక మీరు **అబద్ధమాడుట మాని ప్రతివాడును తన పొరుగువానితో సత్యమే మాటలాడ వలెను." కొలస్సీ. 3:9 "ఒకనితో ఒకడు అబద్ధ మాడకుడి." 1యోహాను 1:9 "మన పాపములను మనము ఒప్పుకొనినయెడల,** ఆయన నమ్మదగినవాడును, నీతిమంతుడును గనుక ఆయన మన **పాపములను క్షమించి సమస్త దుర్నీతినుండి మనలను పవిత్రులనుగా చేయును." కాబట్టి మనము ఎల్లప్పుడును సత్యమే పలుకుదుము. అందువలన దేవుని ఆశీర్వాదములు మన జీవితాలలో ఎల్లప్పుడు ప్రవహించుతుంటాయి.! ఆమేన్.**

